

# ఆశల హామీ నెరవేర్చాలి

**రూ.18 వేల ఫిక్స్డ్ వేతనంపై అసెంబ్లీలో తీర్మానం చేయాలి**

- ఆశ వర్కర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకపోతే నిరవధిక సమ్మెకు వెళతాం
- సిఐటియు జిల్లా కార్యదర్శి కోడం రమణ డిమాండ్
- సిరిసిల్లలో ధర్నా, రాస్తా రోకో

**ప్రజానావ, సిరిసిల్ల :** ఆశ వర్కర్ల సమస్యల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా, నిర్బంధానికి వ్యతిరేకంగా ఆశ వర్కర్లకు ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం 18 వేల రూపాయల ఫిక్స్ వేతనం నిర్ణయించి అసెంబ్లీలో తీర్మానం చేయాలని ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) డిమాండ్ చేసింది. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఆశా వర్కర్లు సిఐటియు ఆధ్వర్యంలో సిరిసిల్ల అంబేద్కర్ చౌక్ వద్ద రాస్తా రోకో - ధర్నా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి మూషం రమేష్ ముఖ్య అతిథిగా హాజరై ఆశా వర్కర్ల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని మీ పక్షంలో నిరవధిక సమ్మెకు వెళ్ళుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎగమంటి ఎల్లారెడ్డి, జిల్లా కార్యదర్శి కోడం రమణ, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మంజుల, కార్యదర్శి జయశీల, సిఐటియు జిల్లా నాయకులు సూరం పద్మ, బూర శ్రీనివాస్, ఐద్వా జిల్లా కార్యదర్శి జవ్వాజి విమల, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు భారతి, గాయత్రి, చంద్రకళ, జమున, లావణ్య, రజిత, రుక్మిణి, లత, భూలక్ష్మి, రేణుక, మమత, సునంద పెద్ద ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# ప్రజావాణికి 205 దరఖాస్తుల రాక

**స్వీకరించిన కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు**



**ప్రజానావ, సిరిసిల్ల :** ప్రజావాణిలో అర్జీలు కలెక్టర్ గరిమ అగ్రవాల్ స్వీకరించి.. పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించి.. ప్రజల నుంచి కలెక్టర్ అర్జీలు స్వీకరించారు. మొత్తం 205 అర్జీలు రాగా, ఆయా శాఖల అధికారులకు అందజేశారు. రెవెన్యూ శాఖకు 82, గృహ నిర్మాణ శాఖకు 35, డీఆర్డీఓకు 30, జిల్లా పంచాయతీ కార్యాలయానికి 9, ఉపాధి కల్పన అధికారికి 8, మున్సిపల్ కమిషనర్ సిరిసిల్ల, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఎస్పీ కార్యాలయానికి ఐదు చొప్పున, జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా సంక్షేమ అధికారి 4, జిల్లా పౌర సరఫరాల శాఖ, జిల్లా వైద్యాధికారి, నీటి పారుదల శాఖ అధికారికి మూడు చొప్పున, జిల్లా పంచాయతీ రాజ్ ఇంజనీర్, డీఎం ఆర్టీసీ సిరిసిల్ల, సెస్ ఎండీకి రెండు చొప్పున, చేనేత అండ్ జౌళి శాఖ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, బీసీ సంక్షేమ అధికారి, జిల్లా విద్యాధికారి, అటవీ శాఖాధికారి, మైనింగ్ అధికారి, జిల్లా ఎక్సైజు అధికారి, యువజన అండ్ స్పోర్ట్స్ అధికారి, ఈడీఎం, జీజీహెచ్ సిరిసిల్ల, సబ్ రిజిస్ట్రార్ సిరిసిల్ల, మెప్మా కార్యాలయానికి ఒకటి చొప్పున రాగా వాటిని సంబంధిత కార్యాలయాలకు పంపించారు. ఈ ప్రజావాణిలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీఓలు వెంకటేశ్వర్లు, రాధాబాయ్, హౌసింగ్ పీడీ వెంకట మాధవ రావు తదితరులు పాల్గొన్నారు.

# పద్మశాలీలకు పద్మతేజం అవార్డుల ప్రదానం



**ప్రజానావ, ముంబై:** పద్మశాలీల ఆరాధ్య దైవమైన మార్కండేయ మహాముని జయంతి పురస్కరించుకొని మార్కండేయ మహాముని వాచనాలయ్ సమితి 22వ వార్షికోత్సవ కార్యక్రమాలు సంస్థాపకులు, స్థానిక నగర్ సేవకులు సంతోష్ శెట్టి, సమితి అధ్యక్షుడు గౌడ శ్రీనివాస్ నేతృత్వంలో ఆదివారం రాత్రి మహారాష్ట్ర,భివండీలోని పద్మనగర్ అఖిల పద్మశాలీ సమాజ్ సాంస్కృతిక భవనంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా రాజకీయ, విద్యా రంగానికి చేసిన సేవలకు గుర్తింపుగా భివండీ కార్పొరేషన్ శిక్షణ మండలి మాజీ చైర్మన్ గాజుల ఆగదాస్, సాంస్కృతిక రంగాలకు గాను విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు, కవి డాక్టర్ వడిగొప్పుల శంకర్, వైద్యరంగంలో చేసిన సేవలకు గాను డాక్టర్ పెంబట్ల సత్యనారాయణ లకు 'పద్మతేజం' పురస్కారం హాజరైన అథితుల చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పురస్కార గ్రహీతలు మాట్లాడుతూ ఈ గౌరవం తమ జీవితంలో మరపురాని క్షణమని పేర్కొంటూ భావోద్వేగానికి లోనయ్యారు. ఎన్నో కష్టాల తర్వాత లభించిన ఈ గుర్తింపు తమకు కొత్త ఉత్సాహాన్ని, ప్రేరణను అందిస్తుందని, ఈ సందర్భంగా వారు తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ అవార్డు కేవలం గౌరవమే కాకుండా, తమ జీవితంలో ఎనలేని ఆనందాన్ని నింపిన అమూల్యమైన గుర్తింపుగా భావిస్తున్నామని ,సంస్థకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్, సంస్థ సంస్థాపక అధ్యక్షుడు సంతోష్ శెట్టి మాట్లాడుతూ.. తాను పుట్టుకతో కన్నడబాషికుడనైన , తెలుగు వారు తనను,తమ వారుగా చేసుకున్నారన్నారు.ఇప్పుడు తాను పూర్తిగా తెలుగు వాడినని, తెలుగు సమాజం కొరకు అన్ని వేళలా, అన్ని విధాలా తాను చేదోడు వాదోడుగా ఉంటానన్నారు.వాచనాలయ్ తరపున గత 22 సంవత్సరాలుగా అనేక కార్యక్రమాలు నిర్వహించామన్నారు.ఇకముందు ఇలాంటి కార్యక్రమాలు కొనసాగిస్తామని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన భివండీ తెలుగు పద్మశాలి సమాజం అధ్యక్షుడు పొట్టబత్తిని రామకృష్ణ మాట్లాడుతూ.. పద్మతేజం ఆవార్డు గ్రహీతలకు అభినందనలు తెలియజేశారు. పద్మశాలీ యువత ఉన్నత విద్య అభ్యసించడంతో పాటు, మంచి సంస్కారంతో మహారాష్ట్ర మాత్రమే కాక దేశవ్యాప్తంగా తమ ప్రతిభను చాటుకుంటున్నారని ప్రశంసించారు. మార్కండేయ వాచనాలయ్ సమితి వారు,గత 22 సంవత్సరాలుగా మార్కండేయ జయంతి ఉత్సవాలు నిర్వహిస్తూ, గత 11 సంవత్సరాలుగా ప్రతిభావంతులను "పద్మతేజం" అవార్డులతో సత్కరించి తెలుగు సమాజ గౌరవాన్ని పెంచుతున్న సంతోష్ శెట్టి, వారి కమిటీ చేస్తున్న సేవకార్యక్రమాలు ఎంతో అద్భుతంగా ఉన్నాయని కొనియాడారు.

### పేద కుటుంబాలకు కుట్టు మిషన్లు పంపకం

ప్రతిభావంతులైన విద్యార్థులతో పాటు, ఈ సంవత్సరం పట్టభద్రులైన వైద్యులు, న్యాయవాదులు, ఇంజనీర్లకు జ్ఞాపికలతో పాటు గుర్తింపు పత్రాన్ని ఇచ్చి సత్కరించారు. అలాగే పేద కుటుంబాలకు చెందిన మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీచేశారు. అలాగే ఈ కార్యక్రమానికి హాజరైన 40 మంది మహిళలు , యువకులు, విద్యా ర్థులకు ప్రత్యేక బహుమతులను అందించారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా విచ్చేసిన పద్మశాలి సమాజం కార్యాధ్యక్షుడు కొండ మల్లేశం, కోషాధికారి అవధూత బలరాం, ప్రధాన కార్య దర్శ గాజెంగి రాజు, స్థానిక కార్పొరేటర్ రజిత మోహన్ కొండ, గాజెంగి కృష్ణ, అడ్వకేట్ చిటికెన్ వెంకటేశ్, బీజేపీ పట్టణ ఆధ్యక్షుడు రవి సావంత్, మాజీ అధ్యక్షుడు అడ్వకేట్ హర్షల్ పాటిల్, ఆర్పీఐ పట్టణ అధ్యక్షుడు మహేంద్ర గైక్వాడ్ తో పాటు హాజరైన తెలుగు సమాజ పెద్దలను, వాచనాలయ్ సమితి ప్రధాన కార్యదర్శి ఈశ్వర్ పాము, కొండ మోహన్, మాజీ అధ్యక్షులు బాలె శ్రీనివాస్, కొండ మోహన్, కిరణ్ సాధుల, మంచికట్ల సత్యం, ఆడెపు శ్రీనివాస్ ఇతర కార్యవర్గ సభ్యులు శాలువా పూలగుచ్ఛం ఇచ్చి ఘనంగా సత్కరించారు. కార్యక్రమాల్లో భాగంగా ఆఖరున దేశభక్తి. దైవభక్తి గేయాలపై చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శనలు సభికులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. తదితర అంశాల అవగాహనపై పిల్లలు చేసిన నృత్యాలు, ప్రదర్శనలు ఆనందపరిచాయి. ఈకార్యక్రమంలో స్థానిక ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



# చేనేత లక్ష్మి మళ్లీ ఆరంభం

**ఉద్యోగులకు అధిక ప్రాధాన్యత**

**ప్రజానావ, సిరిసిల్ల :** రాజన్న సిరిసిల్ల జిల్లాలో చేనేత లక్ష్మి మళ్ళీ ప్రారంభమైంది. ఆన్లైన్ పేమెంట్లు ఉండడం వలన సేల్స్ అధికంగా పెరిగే అవకాశం ఉంది. చేనేత కార్మికులకు మేలు జరుగుతుంది. ఈ పథకం వలన చేనేత కార్మికులకు చేతినిండా పని దొరుకుతుంది. సరసమైన ధరలలో బట్టలు రాయితీపై (డిస్కౌంట్ లో) లభిస్తాయి. అన్ని ప్రభుత్వ శాఖల భాగస్వామ్యం పెరిగితే మాత్రం, చేనేత కార్మికులకు చేతినిండా పని కల్పించడానికి తెలంగాణ ప్రభుత్వం చేనేత లక్ష్మి ప్రస్తుతం ప్రోత్సహిస్తుందని చేనేత జౌళి శాఖ కో ఆర్డినేటర్ వేముల మార్కండేయులు తెలిపారు.

# మెనూ కచ్చితంగా పాటించాలి

**కలెక్టర్ గరిమ అగ్రవాల్**



**ప్రజానావ, సిరిసిల్ల :** విద్యార్థులకు మెనూ కచ్చితంగా పాటిస్తూ నాణ్యమైన భోజనం ఇవ్వాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఎల్లారెడ్డిపేట మండలం దుమాల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ (ఈఎంఆర్ఎస్) విద్యాలయంలో కలెక్టర్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్, స్టోర్ రూమ్ లో ఆహార సామగ్రి, కోడి గుడ్లు, కూరగాయలు, విద్యార్థుల కోసం సిద్ధం చేసిన ఆహార పదార్థాలు, తరగతి, వసతి గదులను పరిశీలించారు. మెనూ ప్రకారం చికెన్, మటన్, కోడి గుడ్లు ఇస్తున్నారా అని ఆరా తీశారు. ప్రభుత్వ మెనూ ప్రకారం భోజనం పెట్టాలని ఆదేశించారు. పరీక్షలకు విద్యార్థులు సిద్ధమవుతుండగా, కలెక్టర్ వారితో మాట్లాడి పలు సూచనలు చేశారు. విద్యార్థులందరూ చదువు పై శ్రద్ధ పెట్టాలని, ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని పేర్కొన్నారు. తాము అనుకున్న ఉద్యోగాలు, ఉన్నత స్థానాలకు ఎదగాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకాంక్షించారు.

# స్టేట్ అండ్ సెంట్రల్ ప్రభుత్వ ఉద్యోగాలపై ఉచిత అవగాహన సదస్సు

**సూచనలు అందజేసిన డీఎస్పి నాగేంద్ర చారి**



**ప్రజానావ, సిరిసిల్ల :** ఆర్ఆర్కె స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని వికాస్ డిగ్రీ కాలేజీలో నిర్వహించిన స్టేట్ అండ్ సెంట్రల్ ప్రభుత్వ ఉద్యోగాలపై ఉచిత అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇంటర్మీడియట్ పూర్తి చేసిన అలాగే డిగ్రీ చదువుతున్న విద్యార్థులు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా సిరిసిల్ల డి.ఎస్.పి నాగేంద్ర చారి అభ్యర్థులకు విలువైన సూచనలు అందించారు. కళాశాల ప్రిన్సిపాల్ జగన్ గౌడ్, ఐకాన్ కోచింగ్ డైరెక్టర్ రమేష్, బాలు గౌడ్, రహ్మాన్ తదితరులు పాల్గొన్నారు. హాజరైన సుమారు 200 మందికి వివిధ ఉద్యోగాలకు సంబంధించిన ఉచిత బుక్‌లెట్ అందించారు. ఈ సదస్సు ద్వారా విద్యార్థులకు ప్రభుత్వ ఉద్యోగాలపై స్పష్టమైన అవగాహన కలిగింది. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన అందరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

# నేడు రిటైర్డ్ ఉద్యోగుల నిరసన

**రాజన్న సిరిసిల్ల జిల్లా రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ పిలుపు**

**ప్రజానావ, సిరిసిల్ల :** పెన్షనరీల సమస్యపై రిటైర్డ్ ఉద్యోగులు మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం నిరసన కార్యక్రమం తలపెట్టారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ప్రతిపక్షాలు మన పెన్షనరీ బకాయిల సమస్యల గురించి వాయిదా తీర్మానాలు ప్రవేశపెట్టి ప్రభుత్వాన్ని ప్రశ్నించినప్పటికీ నేటితో బడ్జెట్ సమావేశాలు ముగిస్తున్నప్పటికీ ప్రభుత్వం మన సమస్యపై ఒక స్పష్టమైన సమగ్రమైన నిర్దిష్టమైన సరియైన నిర్ణయం ప్రకటించలేదని రాజన్న సిరిసిల్ల జిల్లా రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు మల్లారపు పురుషోత్తం ఆందోళన వ్యక్తం చేశారు. దీని కారణంగా రాష్ట్ర రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ పిలుపుమేరకు ఈ నెల 31న ఉదయం 10:30 గంటల నుండి ఒక గంట పాటు రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ ముందు నిరసన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని మల్లారపు పురుషోత్తం అన్నారు. రిటైర్డ్ ఎంప్లాయిస్ అందరూ ఈ నిరసన కార్యక్రమంలో తమ గొంతెత్తి నిరసన వ్యక్తం చేయాల్సిన అవసరం ఉన్నందున పెద్ద ఎత్తున తరలి రావలసిందిగా కోరారు.ఈ నిరసన కార్యక్రమాన్ని ముగించుకొని , జిల్లా కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి మెమొరాండం సమర్పించడం జరుగుతుంది. కనుక రిటైర్డ్ ఎంప్లాయిస్ రాజన్న సిరిసిల్ల జిల్లా పరిధిలో పనిచేసి రిటైర్డ్ అయిన మిత్రులు అందరూ కూడా పెద్ద మొత్తంలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా పురుషోత్తం కోరారు.

